

దోమలగూడ అడ్వకేట్ కాలనీలో శివపార్వతుల కల్యాణంలో మాజీ కార్పొరేటర్ టి రవీందర్, అర్చకులు, భక్తులు

అంగరంగ వైభవంగా శివపార్వతుల కల్యాణం

కవాడిగూడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తికమాసం పురస్కరించుకొని కవాడిగూడ డివిజన్ దోమలగూడ అడ్వకేట్స్ కాలనీలోని బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ టి.రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం శివపార్వతుల కల్యాణ వైభవంగా కనులపండువగా నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేసి వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. కల్యాణం అనంతరం ఆలయ చైర్మన్ మాజీ కార్పొరేటర్ టి రవీందర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు జి వెంకటేష్, తాళ్లబస్తీ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్‌ముదిరాజ్, శివరాజ్, ఆలయ కమిటీ సభ్యులు ఎ.ప్రభాకర్ గంగపుత్ర, వై.శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్ బీజేపీ ప్రధాన కార్యదర్శి కేశవరాజు, అనిల్, సూర్యనారాయణ, రమేష్‌గౌడ్‌తో పాటు భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన చేశారు. ఆలయ చైర్మన్ రవీందర్ మట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

పద్మశాలీ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నియామకం



నర్సింగ్‌రావు

రాంనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ సంఘం సంయుక్త కార్యదర్శిగా అంబర్‌పేట నియోజకవర్గంలోని విద్యానగర్ టీఆర్‌టీ కాలనీకి చెందిన శంకర్‌గారి నర్సింగ్‌రావు నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ నియామక పత్రం అందజేశారు. అనంతరం నర్సింగ్‌రావు మాట్లాడుతూ పద్మశాలీలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రాణించేలా కృషి చేస్తానన్నారు. ఈ పదవి ఇచ్చినందుకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'వర్గీకరణ తీర్పును పునః సమీక్షించాలి'

నల్లకుంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ రాష్ట్ర చైర్మన్ మన్నె శ్రీధర్‌రావు, రాష్ట్ర కన్వీనర్ పి.బల్వంత్‌రావులు డిమాండ్ చేశారు. దేశంలోని రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తే ఒప్పుకోలేమని, పార్లమెంట్ ఆమోదిస్తే అంగీకరిస్తామని వారన్నారు. సోమవారం హైదర్‌గూడలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు న్యాయస్థానాలకు సంబంధం లేకుండా రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. వర్గీకరణ అమలు చేయకుండా రిజర్వేషన్లు 23 శాతం పెంచాలని, 2000 నుంచి 2024 వర్గీకరణ అమలు చేసిన చంద్రబాబు, వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి, కేసీఆర్ ప్రభుత్వాలు అమలు చేసిన నష్ట పరిహారం తిరిగి చెల్లించాలన్నారు. డిసెంబర్ 1న హైదరాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జన ద్వారా పాలకులకు తమ సత్తా చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ రాష్ట్ర కో-చైర్మన్‌లు తాలుకా రాజేష్, శతారి ప్రవీణ్, గోకుల కల్యాణ్, అంజలి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

అంగన్‌వాడీలో నాణ్యమైన విద్యను అందించాలి

బర్కత్‌పుర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలో నాణ్యమైన విద్యను అందించాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. చిన్నారులకు గుడ్డుతో పాటు పౌష్టికాహారం అందించాలని కోరారు. సోమవారం నింబోలిఅడ్డలోని డివిజన్ అభివృద్ధి కార్యాలయంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలను మరింత బలోపేతం చేయాలని, టీచర్లు, సూపర్‌వైజర్లు అంకితభావంతో పనిచేయాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కవిత, టీచర్లు లావణ్య, తారా, సారిక, శాంతాబాయి పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి ఆలయంలో ఘృతశర్కరాభిషేకం

చిక్కడపల్లి, నవంబర్ 18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి దేవాలయం ఆవరణలోని పార్వతీక్షీరలింగేశ్వరస్వామి మందిరంలో కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఘృతశర్కరాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో సాగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ఆకాశ దీపోత్సవం కార్యక్రమాలు జరిగాయి.

లగచర్ల రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటం

రాంనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): లగచర్ల గిరిజన రైతులకు న్యాయం జరిగే వరకూ తమ పోరాటం ఆగదని సేవాలాల్ సేన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు కల్యాణ్‌నాయక్ పేర్కొన్నారు. లగచర్ల గిరిజనులకు మద్దతుగా సేవాలాల్ సేన ఇచ్చిన ఉద్యమ కార్యక్రమాల నేపథ్యంలో బాగ్‌లింగంపల్లిలోని లంబాడీ తండాలో నివాసం ఉంటున్న కల్యాణ్ నాయక్‌ను పోలీసులు ఆదివారం అర్ధరాత్రి అరెస్ట్ చేసి సోమవారం సాయంత్రం ఆయనను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులపై అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని, వారి భూములను ఫార్మా కంపెనీ తీసుకోవద్దని సేవాలాల్ సేన తరఫున సీఎంను కలిసి శాంతియుతంగా చర్చిస్తామని అన్నారు.



భవాని శంకర ఆలయంలో ఆకాశదీపం వెలిగించిన భక్తులు

భవానీశంకర ఆలయంలో కార్తీక పూజలు

ముషీరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ దేవునితోటలోని ప్రసిద్ధిగాంచిన భవానీ శంకర దేవాలయంలో సోమవారం ఆకాశ దీపోత్సవ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి ఫలరసాయణాలతో అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవాదాయ ఈవో జ్యోతి, సిబ్బంది సురేష్ కుమార్ పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న సురేష్‌కుమార్, అనిల్

అందరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి

ముషీరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకొని పేదలను ఆదుకోవాలని కాంగ్రెస్ గ్రేటర్ ఉపాధ్యక్షుడు మేడి సురేష్ కుమార్ అన్నారు. సోమవారం భోలక్‌పూర్‌కు చెందిన అనిల్ ఆధ్వర్యంలో దేవునార్ ఫౌండేషర్ బ్లైండ్ పాఠశాలలో విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. అంధులను చేరదీసి వారికి విద్యాబుద్ధులు అందించి తోటి విద్యార్థులతో సమానంగా చేయాతనివ్వాలన్నారు. అనంతరం విద్యార్థులకు దుస్తులు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవునార్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సాయిబాబాగౌడ్, నాయకులు ప్రవీణ్, గౌస్‌పాషా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హలో..మీరు

- రోడ్లపై చెత్త వేస్తున్నారా... నీ ఫొటో చిక్కినట్టే..
- సీసీ కెమెరాల ఏర్పాటుతో పారిశుధ్య సమస్యకు చెక్
- మంచి ఫలితాలు వస్తున్నాయంటున్న జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు

సీసీ కెమెరాల్లో కనిపిస్తున్నారు



పార్శిగుట్టలో చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉన్న రోడ్డు

ముషీరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య సమస్యను పరిష్కరించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు వినూత్న ఏర్పాట్లు చేస్తున్నారు. సీసీ కెమెరాలు, మైకులను ఏర్పాటు చేసి రోడ్లపై చెత్త వేయకుండా చర్యలు చేపట్టారు. తద్వారా మంచి ఫలితాలు వస్తుండడంతో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు మరికొన్ని చోట్ల ఇలాంటి ఏర్పాట్లు చేసేందుకు సిద్ధపడుతున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జీహెచ్ఎంసీ సర్కిల్-15 పరిధిలోని ముషీరాబాద్‌లో పారిశుధ్య సమస్య అధికంగా ఉన్న ప్రాంతాలను జీహెచ్ఎంసీ అధికారులు గుర్తించి ఆ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను, మైకులను ఏర్పాటు చేసి చెత్త వేయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మొదటి విడుతలో భాగంగా ముషీరాబాద్ డివిజన్‌లోని పార్శిగుట్ట చౌరస్తా, అడిగ్‌మెట్ డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ చెత్తవేయకండి.. అంటూ మైక్‌లో వినిపించేలా రికార్డింగ్ వాయిస్‌ను ఏర్పాటు చేయడంతో ఈ రెండు ప్రాంతాలు పారిశుధ్య సమస్య తలెత్తడం లేదు. దీంతో ఈ ప్రయోగం మంచి ఫలితాలు వస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

చెత్త వేస్తే చలానా విధిస్తాం

'హలో.. మీరు సీసీ కెమెరాలో కనిపిస్తున్నారు. ఇక్కడ చెత్త వేయకండి... వేస్తే చలానా విధిస్తాం' అంటూ రికార్డింగ్ చేసిన వాయిస్ మైక్‌లో వినిపిస్తుండడంతో చెత్తవేయడం తగ్గిందని అధికారులు చెబుతున్నారు. సీసీ కెమెరాలు అటుగా వెళ్లేవారిని స్కాన్ చేసి చెత్తవేసేందుకు వచ్చిన వారిని గుర్తించగానే మైక్‌లు రికార్డింగ్ వాయిస్‌ను వినిపిస్తున్నాయి. దీంతో ప్రజలు భయంతో చెత్తవేయడం లేదు.



పార్శిగుట్టలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

మంచి ఫలితాలు వస్తున్నాయి



సీసీ కెమెరాలు, మైక్‌ల ద్వారా రికార్డింగ్ వాయిస్ వస్తుండడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. భోలక్‌పూర్‌లో పారిశుధ్య సమస్య అధికంగా ఉన్న ప్రాంతాలలో వాయిస్‌తో కూడిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

- ఎస్ఎఫ్ఏ హరినాథ్, భోలక్‌పూర్

త్వరలో మరిన్ని ప్రాంతాల్లో ఏర్పాటు

పారిశుధ్య సమస్య అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించాం. అక్కడ కూడా త్వరలో వాయిస్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తాం. భోలక్‌పూర్‌లోని దేవుని తోట వద్ద సమస్య అధికంగా ఉంది. అక్కడ కూడా సీసీ కెమెరాలు త్వరలో ఏర్పాటు చేస్తాం. ప్రజలు సామాజిక బాధ్యతతో ఇంటి చెత్తను చెత్తను కార్మికులకు అందజేయాలి. స్వచ్ఛ హైదరాబాద్‌కు సహకరించాలి. సీసీ కెమెరాలో రికార్డైయిన చెత్త వేసే వ్యక్తులను, వాహనాలను గుర్తించి వారికి చలాన్‌లు రాస్తున్నాం.

- డాక్టర్ ప్రవీణ, జీహెచ్ఎంసీ సర్కిల్-15 ఏఎంవోహెచ్



బస్తీవాసులతో కలుషిత తాగునీటి సరఫరా సమస్య తెలుసుకుంటున్న కార్పొరేటర్

కలుషితనీటి సమస్య పరిష్కరిస్తా - కార్పొరేటర్

చిక్కడపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సబర్మతినగర్ బస్తీవాసుల కలుషిత నీటి సరఫరా సమస్యను పరిష్కరిస్తానని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ పేర్కొన్నారు. నాలుగు నెలలుగా సబర్మతినగర్ బస్తీలో మంచినీటి నల్లాల్లో కలుషిత నీరు సరఫరా అవుతుండడంతో స్థానికులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారని ఫిర్యాదు రావడంతో సోమవారం కార్పొరేటర్ ఆ బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా కలుషితనీటి సరఫరా గురించి బస్తీవాసులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత జలమండలి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం త్వరలో బస్తీవాసులకు కలుషిత మంచినీటి సరఫరా సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ లైన్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్, సిబ్బంది జగన్, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, నాయకులు ఎం.ఉమేష్, సాయికుమార్, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు, బస్తీవాసులు యాదగిరి, లక్ష్మణ్, చందు, బి.యాదగిరి, శివ, రాము, పుష్ప, శారద, ఐలమ్మ, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి



సదస్సులో అభివాదం చేస్తున్న వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు

రాంనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పంటకు మద్దతు ధరలను ప్రకటించి చట్టబద్ధమైన కొనుగోలుకు హామీ ఇవ్వాలని, కార్మికుల హక్కులను కాలరాస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. రైతు, కార్మిక, ప్రజల జీవనోపాధిని రక్షించాలని, ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న జరగనున్న రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ అండ్ సంయుక్త కిసాన్ మోర్చాల ఆధ్వర్యంలో కార్మిక సంఘాల జేఏసీ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పశ్యపద్మ, పి.సాగర్, వి.ప్రభాకర్, వేములపల్లి వెంకట్రామయ్య, బాల్‌రాజ్, జె.వెంకటేష్, కె.సూర్యం, విజయకుమార్, ఎస్.ఎల్.పద్మ, అరుణ, నాగన్న గౌడ్, శివబాబు, మూడ్ శోభన్, కెచ్చెల రంగారెడ్డి, కిరణ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతులందరికీ పూర్తిగా పంట రుణాలను మాఫీ చేయాలన్నారు. రక్షణ, రైల్వే ఆరోగ్యం, విద్యా, విద్యుత్‌రంగాలను ప్రైవేటీకరణ చేయవద్దని, గృహాలకు ఉచిత విద్యుత్ 500 యూనిట్ వరకు ఇవ్వాలని కోరారు. భూసేకరణ చట్టం 2013ను అటవీ హక్కుల చట్టం 2006ను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అసంఘటిత కార్మికులకు యూనివర్సల్ సోషల్ సెక్యూరిటీ స్కీమ్‌ను ప్రవేశపెట్టాలని, 2019 ఎంవీ యాక్ట్ సవరించి మోటార్ కార్మికులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిరణ్, గణేష్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెలను పంపిణీ చేయాలి

గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్, రవీందర్ తదితరులు

రాంనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గొర్రెల పెంపకందారుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడి రెండో విడత గొర్రెలను పంపిణీ చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం డిమాండ్ చేసింది. సోమవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ వైఖరిపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కిల్లె గోపాల్, ఉడతా రవీందర్, ఓయూ ప్రొఫెసర్ బి.రామయ్య, గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం కార్యదర్శి ఎం.తిరుపతియాదవ్, మాదాసి కురుమ సంఘం వ్యవస్థాపకులు డి.రంగన్న, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర నాయకులు జి.చంద్రుడుయాదవ్, కురుమ యువ చైతన్య కమిటీ అధ్యక్షుడు జి.నర్సింహ, తెలంగాణ యాదవ సంక్షేమ సంఘం నాయకుడు మధు యాదవ్‌లు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా యేడాది కాలయాపన చేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉరేసుకుని కూలీ ఆత్మహత్య

బర్కత్‌పుర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్ నుంచి కూలీ కోసం నగరానికి వచ్చిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం. పశ్చిమబెంగాల్‌కు చెందిన డి.సంతాల్(38) కూలీ పని కోసం నెల రోజుల క్రితం నగరానికి వచ్చాడు. కాచిగూడ పరిసర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తూ పని చేసుకున్నాడు. సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఖాజాగిరీబ్‌లోని దేవాలయం సమీపంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



నివాళులర్పిస్తున్న జయసూర్య, జనార్దనమూర్తి

తెలుగు భాషా ప్రవీణుడు సీపీ బ్రౌన్

చిక్కడపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాతృభాష ఆంగ్లం అయినప్పటికి బ్రిటిష్ అధికారిగా తెలుగునేలపై విధులు నిర్వహిస్తున్న సందర్భంలో సీపీ బ్రౌన్ తెలుగు బాషపై ఆసక్తితో భాషాభివృద్ధికి విశేషకృషి చేశారని ప్రముఖ జర్నలిస్టు జయసూర్య అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో గానసభ నిర్వహిస్తున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా సీపీ బ్రౌన్ యాదిలో సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా జయసూర్య మాట్లాడుతూ బ్రౌన్, వేమన శతకపద్యాలు సమర్థంగా సేకరించి పరిష్కృతం చేసే నిమిత్తం ఎందరో పండితులను సంప్రదించారని గుర్తు చేశారు. తెలుగుభాషా పదకోశం కోసం తన ఆదాయంలో కొంత భాగం వెచ్చించి భాషావేత్తల సలహాలు తీసుకుని బ్రౌన్ నిఘంటువు వెలువరించిన మహనీయుడు అన్నారు. సభలో గుదిబండి వెంకటరెడ్డి, సాహితీవేత్త షహనాజ్ బేగం, కాంగ్రెస్‌నాయకులు శ్రీమణి, గానసభ సంయుక్త కార్యదర్శి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు: ఎమ్మెల్యే



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోపాల్

రాంనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ డివిజన్‌లోని బాకారం వెస్లీచర్చి ప్రాంతంలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు చేపడతామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి నూతన పైప్‌లైన్ ఏర్పాటుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జలమండలి అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. సోమవారం జలమండలి చిలకలగూడ డీజీఎం మోహన్‌రాజ్ స్థానికులతో కలిసి బాకారంలో పర్యటించి డ్రైనేజీ సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెస్లీ చర్చి సభ్యులు తాము ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యేకు వివరించారు. డ్రైనేజీ లీకేజీ వల్ల చర్చిలోకి రాకపోకలు సాగించడానికి ఇబ్బంది ఏర్పడుతోందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపడతామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు టి.శంకర్ ముదిరాజ్, నాయకులు ముచ్చకూర్తి ప్రభాకర్, కేశపురం అరుణ్, ముదిగొండ మురళీ, నవీన్, వెంకటేష్, వెస్లీచర్చి సభ్యులు బీజె.శాంసన్, కె.జయరావు, సునీల్, ఎస్.కె.సైమన్, కరుణానందం, మైఖేల్ ప్రసన్న, విజయ్‌కుమార్, కె.జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలి'

బర్కత్‌పుర, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో చాలా మంది విద్యార్థులు మధ్యలోనే చదువు మానేసి గ్రామాలకు వెళ్తున్నారన్నారు.రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిధులు విడుదల చేయాలని లేకపోతే బీజేవైఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్య మం చేపడతామని ఆయన హెచ్చరించారు.

రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లను

కేంద్రం విస్మరించడం దుర్మార్గం

అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి బీఎస్ రాంబాబు




ఇందిరాపార్కు వద్ద జరిగిన ధర్నాలో దేశ్‌పాండే, రాంబాబు, సంఘం నేతలు

కవాడిగూడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ బ్యాంకుల వృద్ధిలో కీలక పాత్ర పోషించిన రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం విస్మరించడం దుర్మార్గమని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ కార్యదర్శి బీఎస్ రాంబాబు అన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు రిటైరీస్ ఆర్గనైజేషన్స్ పిలుపుమేరకు తెలంగాణ బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో సోమవారం రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగులతో మహాధర్నా నిర్వహించారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. తెలంగాణ బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్‌వీ రమణ అధ్యక్షతన నిర్వహించిన మహాధర్నాలో యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు రిటైరీస్ ఆర్గనైజేషన్స్ జాతీయ అధ్యక్షుడు దేశ్‌పాండే ఈ ధర్నాను ప్రారంభించగా, బీఎస్ రాంబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పెన్షన్ ముఖ్యమైన సామాజిక భద్రతా ప్రమాణాలలో ఒకటని మూడు దశాబ్దాలు ఆ బ్యాంకు ఉద్యోగుల పెన్షన్ నవీకరణ జరగకపోవడం దారుణమన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ వెంటనే స్పందించి బ్యాంకు ఉద్యోగుల పెన్షన్ నవీకరణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్ఎం దేశ్‌పాండే మాట్లాడుతూ, ముప్పై సంవత్సరాలుగా పెన్షన్ నవీకరణ జరగకపోవడంతో రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ నవీకరణతో పాటు ప్రత్యేక అలవెన్సులు, కమ్యూటేషన్ వ్యవధి, ప్రైవేట్ రంగ బ్యాంకుల ద్వారా పదవీ విరమణ పొందిన వారికి పెన్షన్, ఎక్స్‌గ్రేషియా చెల్లింపు. ఈ ధర్నాలో తెలంగాణ బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ చైర్మన్ ఎ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎంఎస్ రావు. ఆర్.లక్ష్మణ్‌రావు, ఉప ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ఎన్ రెడ్డి, ఏఐబీఆర్ఎఫ్ కార్యదర్శులు వారణాసి, వి కృష్ణమూర్తి టిబిఆర్ఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ బీవీ నారాయణరావు, నేతలు జానకిరామ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి పున:ప్రతిష్ఠ

హాజరైన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, వీహెచ్



బొడ్రాయి పున: ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే వెంకటేష్ దంపతులు

అంబర్‌పేట/ నల్లకుంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో అంబర్‌పేటలోని బొడ్రాయి (నాభిశిల) పునఃప్రతిష్ఠ కార్యక్రమం మొదటి రోజు ఘనంగా నిర్వహించారు. ఉదయం 8.30 గంటలకు గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, రక్షాబంధనం, అఖండ దీపారాధన, అంకురార్ప ణ వేదపండితుల ఆధ్వర్యంలో సంప్రదాయ రీతిలో బొడ్రాయి పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, బాగ్ అంబర్‌పేట, అంబర్‌పేట కార్పొరేటర్లు బి.పద్మావెంకటరెడ్డి, విజయ్‌కుమార్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు కాలేరు పద్మావెంకటేష్, బి.వెంకటరెడ్డి, అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి చీఫ్ అడ్వయిజర్ కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, చైర్మన్ పి.జ్ఞానేశ్వర్ గౌడ్, అధ్యక్షుడు వై.శంకర్‌గౌడ్‌లు హాజరై పూజలు నిర్వహించారు. అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి సభ్యులు, ప్రజలు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బొడ్రాయి పున:ప్రతిష్ఠా కార్యక్రమం ఊరేగింపులో పోచమ్మబస్తీ నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది. కార్యక్రమంలో అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఉపాధ్యక్షుడు రంగంపల్లి రాజు, ప్రధాన కార్యదర్శి బింది మల్లికార్జున్‌గౌడ్, కార్యదర్శి చెంగల్ సుధాకర్, కార్యనిర్వహణ కార్యదర్శి కిషోర్, కోశాధికారి గడ్డం శ్రీధర్‌గౌడ్, ఫైనాన్స్ కమిటీ కన్వీనర్ పంజాల గిరిధర్‌గౌడ్, అంబర్‌పేట బొడ్రాయి పున: నిర్మాణ కమిటీ కన్వీనర్ చింతల శ్రీనివాస్ ముదిరాజ్, కమిటీ ప్రతినిధులు దడిగే జగన్‌యాదవ్, మహేందర్‌గౌడ్, అజయ్‌కుమార్, కెంచె చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ ఉన్నత స్థాయిలో నిలుపుతుంది



బండారు సుబ్బారావును సన్మానిస్తున్న దామోదర్, ఆమని

చిక్కడపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిజాయితీ, సేవాభావం వ్యక్తిని ఉన్నతస్థాయిలో నిలుపుతాయని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. బండారు సుబ్బారావు వ్యాపారరంగంలో నిజాయితీగా ఉంటూ సేవా కార్యక్రమాల్లో నిరంతరం సహాయం అందిస్తున్నారని, సేవా కార్యక్రమాలు ఆయనను సమాజంలో ఉన్నత వ్యక్తిత్వం కలవారిగా నిలిచి ఉంచుతాయని అభినందించారు. సీల్‌వెల్ కార్పొరేషన్ చైర్మన్ బండారు సుబ్బారావును చిక్కడపల్లిలోని ఓ ప్రయివేట్ హోటల్‌లో శ్రుతిలయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. సంస్థ కార్యదర్శి ఆమని మాట్లాడుతూ.. ఎందరో కళాకారులను ప్రోత్సహిస్తూ తమ సంస్థకు వెన్నుదన్నుగా నిలిచిన సుబ్బారావు కళాహృదయుడు సేవాతత్పరత కలవారని కొనియాడారు. పలువురు గాయనీగాయకులు శిరీష, అరుణ తదితర కళాకారులు మాట్లాడుతూ సుబ్బారావు కోవిడ్ సమయంలో జర్నలిస్టులకు నిత్యావసర వస్తువులు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బండారు సుబ్బారావు దంపతులను సత్కరించి ఆదర్శ దంపతులు పురస్కారం శ్రుతిలయ సంస్థ పక్షాన బహూకరించారు.